# బల్లిచెక్క!

రచన :
శ్రీ యల్. రాజాగణేష్, బి. యస్‌సి.,

వర్షం కురుస్తున్నట్టు రాల్తున్న మంచులో, పుచ్చపువ్వులాంటి వెన్నెల్లో తడుస్తూ నడుస్తున్నాడు రాజేంద్ర. కొంపతీసి తనకు చెవుడు రాలేదుకదా అన్నంత నిశ్శబ్దంగా ఉంది వాతావరణం. ఒక్క నిశ్శబ్దమే కాదు. ఆ ప్రాంతపు బాహ్యస్థితి గతులన్నీ అంతే చిత్రంగా ఉన్నాయ్! చిత్రాతి చిత్రంగా ఉన్నాయ్!!

నడిచి నడిచి చివరికీ ఒడ్లొరుసుకు ప్రవహిస్తున్న ఏటిగట్టుకి చేరుకున్నాడు రాజేంద్ర. అంతే ఆవలి ఒడ్డుకు చూస్తూ నిల్చిపోయాడు చాలాసేపు. దగ్గర్లో లేక పోయినా ఆవలిఒడ్డుకి సంబంధించిన అనేక విషయాలు కళ్ళల్లో రూపుదిద్దుకుంటున్నాయ్! వెంటనే అక్కడికి చేరుకోవాలని అటూ ఇటూ చూశాడతను. ఎవ్వరూ లేరు ఏ ఉపాయమూ తోచలేదు. తనకొక మైలు దూరంలో అసలు మని షంటూ ఉన్నట్టు లేదు. "ఆ ఒడ్డుకి చేరాలి. పోనీ తనకు ఈతైనా రాదు మరెలా? ఎలా?" మునిపంటితో పెదిమకొరికి పట్టి ఆలోచిస్తూ గొణుక్కున్నాడు. అలవాటు ప్రకారం తలగోక్కున్నాడు. ఏదో ఆత్రం అంతకంతకూ అతన్లో పెచ్చుపెరిగిపోతుంది.

అంతలోనే మరింత విచిత్రంగా-

"బాబయ్యా! ఆ ఒడ్డుకి చేరాలి!! ఎలా??" ఎవరిదో కంఠం తట్టిపిల్చింది.

త్రుళ్ళిపడి చూశాడు తను.

ఎవరో మనిషి! గెడ్డంతో, మీసాల్తో కప్పబడిపోయిన ముఖం, వయోభారం మోయలేక ఒంగిపోయిన నడుం, సడలిపోయిన పండుశరీరం, ఒకచేతిలో కోతి, మరో చేతిలో పాములుపెట్టె మొత్తాని కెవరైనా మనిషే! సందేహంలేదు. ముసలి పాములవాడు! తనలాగే ఆవలిఒడ్డుకి చేరుకోవాలనుకుంటున్నాడు! కళ్ళు నులుముకుని మళ్ళీచూసి నిర్ధారణ చేసుకున్నాడు రాజేంద్ర.

"బాబయ్యా! ఆ ఒడ్డుకి చేరుకోవాలి! ఎలా??" మళ్ళీ అదే ప్రశ్న.

"అదే అర్థంకావడంలేదు" ముక్తసరి సమాధాన మిచ్చాడు రాజేంద్ర.

ఏటికి ఇవేవీ పట్టనట్టు తనదారిని తాను పోతూనే ఉంది.

చేతులపై ఏదో పాకుతున్నట్టనిపించి క్రిందికి చూశాడు తను. కోతి తనకాళ్ళపై ఏదో పుల్లతో గీస్తుంది. తనవైపు పళ్ళికి లిస్తూ చూస్తుంది. రాజేంద్ర కూడా కోతివైపే చూస్తూ ఉండిపోయాడు. కానీ అతని ధ్యానాని కడ్డుగా.

"బాబయ్యా! ఆ ఒడ్డు చేరడం ఎలా?" ముసలాడు మళ్ళీ ప్రశ్నించాడు.

"అదే అర్థంకావడంలేదు" మళ్ళీ అదే సమాధాన మిచ్చాడు తను.

మాంత్రికుడు మంత్రించి నీళ్ళు జల్లితే పుట్టుకొచ్చినట్టు ఇద్దరు మనుష్యులు బెల్లంవండే పళ్ళెం పట్టుకుని వచ్చి తన కెదురుగా ఉంచారు.

"నలుగురం నాలుగు పక్కలా కూర్చుని ఆవలొడ్డుకి పోదాం రండి బాబూ!" ప్రాధేయపూర్వకంగా అన్నారు.

"రండి బాబూ! వర్షం వచ్చేట్టుంది. వేగంగా రండి." అని తొందరచేశారు సిన్మా చూస్తున్నట్టనిపించింది రాజేంద్రకి.

కోతి ఆనందం పట్టలేక కిచకిచా అరిచింది

గంతులేసింది రాజేంద్ర కాళ్ళు దానిచేతి వ్రేళ్ళతో గోకేసింది. దానికెందుకో పండగలా ఉంది, సంబరంలా ఉంది, ఆమాట కొస్తే అందరికీ ఆలాగేఉంది.

తెడ్లతో పళ్ళాన్ని నెట్టుకుంటూ ఎలాగైతేనేం ఏటి మధ్యకొచ్చారు. మరోకొద్దిక్షణాల్లో ఆవలగట్టుకి చేరుతామనే ఉత్సాహం అందరికీ క్షణక్షణానికీ ఎక్కువౌతూనే ఉంది. తెడ్లుతో నీటిని కోస్తూ ముందుముందుకి పళ్ళాన్ని నెట్టుతూనే ఉన్నారు. మంచూ వెన్నెలా కలిసిజాలువారుతూనే ఉంది. ప్రశాంతత చిక్కబడ్తూనే ఉంది. చుట్టూచూసి ఆనందం పట్టలేక సన్నని రాగం తీస్తూ చిటికెలు వేసాడు రాజేంద్ర. నేను మాత్రం తీసిపోయానా అన్నట్టు పాముల బుట్టపై మోదుతూ రాగం తీయబోయింది. కానీ దానికి రాగం తీయడం సాధ్యపడలేదు.

రాజేంద్ర దానికేసి కోపంగా చూస్తూ రాగం పెద్దది చేశాడు.

కోతికూడా కోపంగా చూసింది.

రాజేంద్ర కోతిని మరింత భయపెట్టాలని చెయ్యిపైకెత్తి గదమాయించి చూశాడు. అది మరింత కోపంగా చెయ్యిపైకెత్తి గుడ్లురిమి మరీచూసింది.

చిన్న పుల్లముక్క విసిరాడతను.

పాముల బుట్టమూత తీసి విసిరింది కోతి.

పాము బుస్సున లేచింది, బయటకి కదిలింది. అంతే!

“పాము...పాము...” గొంతు చించుకు అరిచాడు తను. తనతోపాటుగా అందరూ స్థలం చెదిరిపోయారు.

కేకలు...అల్లరి...గోల...గగ్గోల.

బేలన్స్ తప్పి ఉరుగుల, పరుగుల, నురుగుల, కెరటాల్లో కలిసిపోయింది పళ్ళెం. అందరూ కొట్టుకు పోతూనే ఉన్నారు.

రాజేంద్ర కూడా ఏరుపారుతున్న వేపే కదిలిపోతున్నాడు. నీరు త్రాగేస్తూ ఊపిరి సలపక గింజుకుంటున్నాడు. చేతికేదైనా తగుల్తుందేమోనని వెతుక్కుంటున్నాడు. ఏదో దొరికి నట్టేదొరికింది. మెత్తగా తగిలింది. ‘అమ్మో!’ అనరిచాడు. నెలువెల్లా కంపించిపోయాడు వెంటనే వదిలేసాడు.

అది పాము!!!

అందరూ కొట్టుకుపోతున్నారు. ప్రాణాల మీద ఆశ వదిలేసుకుని మరోక్షణంలోనో, ఘడియలోనే, మునిగిపోబోతున్నారు. ఆవలి గట్టుకి చేరుతామనే కొండంత సంబరానికి విరుగుడు ఏదోక్షణంలో ఉంటుందన్న సంగతి ఎవరూ కనీసం ఊహించనైనాలేదు. ఏదేమైనా, ఏం జరగబోతుందోననే ఏక్షణపు పోకడైనా ఎవరికి తెల్సు?? మృత్యువు ముంగిటకొచ్చి సంబరం చేసుకోవడమంటే ఇదే కాబోలు!!

‘అమ్మా! అమ్మా! సుజా! సుజా!’ ఆత్మీయుల్ని తల్చుకుంటూ అరవడం తప్ప వేరేమీ చెయ్యలేకపోయాడు రాజేంద్ర చివరికి.

మృత్యువుతో పెనుగులాడ్తున్నాడు. అరుస్తున్నాడు. కాళ్ళూ చేతులూ రెపరెపలాడిస్తున్నాడు. మనిషి చచ్చేస్థితిలో ఉన్నా ఆశ చావడంలేదు. ఏదో ఆరాటం. ఎంతో తపన కొండంత ఆశ దరిచేరేందుకు ఏకాస్త ఆసరా దొరిగినా చాలనే తాపత్రయం. చేతికేదో ఈసారి గట్టిగా బలంగా తగిలింది. అందుకున్నాడు, గట్టిగా పట్టుకున్నాడు. దానిపై తనగుండెల్ని మోపి కొంచెం గాలి పీల్చుకో

గల్గాడు.

అది బల్లచెక్క!

క్షణం క్రితం కళ్ళల్లో చీకటి! కటిక చీకటి!!

ప్రస్తుతం - వెన్నెల వెలుగు! బల్లచెక్క! దానిపై తను! తనచుట్టూ ప్రపంచం!

"ఔను సృష్టిలో పనికి రానిదంటూ ఏదీ లేదు." లోలోనే గొణుక్కున్నాడు.

నానా విధాలుగా ప్రయత్నించి ఎలాగైతేనేం రొప్పుతూ, రోజుతూ, బల్ల చెక్క సాయంతో ఒడ్డుకు చేరుకోగల్గాడు తను. బల్ల చెక్కను ఒడ్డుకు చేర్చి తనూ చేరి రెండు చేతులూ జోడించి అలాగే ఉండిపోయాడు చాలా సేపు.

మూసిన అతని కన్నుల్లో గత బాసలు కదిలాయి, అలలు అలలుగా...

"సుజా! ఏయ్! సుజా! మళ్ళీ ఈ బల్లచెక్క ఇక్కడుంచావేం? ఇది వీధిలోనో, పొయ్యిలోనో పారెయ్యమని చెప్పానా? ఇంత శుభ్రంగా ఉన్న ఈ ఇంట్లో ఇలాంటి పెంటకుప్ప మీది పరికరాలు తెచ్చి పెట్టొద్దన్నానా? పారెయ్! పారేయ్! ఆఁ!" గద్దించి మరీ చెప్పాడుతను. సుజాత మౌనంగా అతని మాటలు వినబడనట్టే నిల్చుంది.

"మాట్లాడవేం? నిన్నే!" మళ్ళీ అన్నాడతను.

ఈసారి సమాధానం చెప్పడం తప్పక ఎప్పటిలాగానే- "ఈ బల్లచెక్క మీకేం అడ్డం. దీని వెనక చాలా చరిత్ర ఉంది. దీని మీదే మా నాన్నగారు కథలు వ్రాసేవారు. దీని మీదే నేను చిన్నప్పుడు స్కూల్ పాఠాలు వ్రాసుకునేదాన్ని. దీని మీదే...మా తమ్ముడు...మా చెల్లెమ్మ...అందుకే ఇదినాకు సరస్వతీ పీఠం."

"ఊఁ! ఈ హరికథ ఎప్పుడూ చెప్పేదే... కానీ ఇప్పుడిది వట్టి అసహ్యంగా తయారైందని చూస్తే తెలీడంలే. ఇప్పటికి నీకు లక్షసార్లు చెప్పాను. పారెయ్యి! వెంటనే పారెయ్యి! పారేస్తావా? పారెయ్యవా? నా కాలికి తగిలి అడ్డుగా ఉంటుంది. పారెయ్యి! ఆఁ! చెప్పింది వినబట్టం లేదా? నీకే! కదలవేం? పిచ్చాడిలా అరిచాడుతను. సుజాత బల్లచెక్క అందుకొని వీధిలోకి వెళ్ళింది...

...అదే బల్లచెక్క తననిప్పుడు రక్షించింది. పెంటకుప్ప మీది బల్లచెక్క ఏట్లోకెలా వచ్చింది? అయినా తను ఏట్లో కెలా వచ్చాడు? ఏరు పేరేమిటి? ఆవలిగట్టుకి తనకు వెళ్ళాల్సినంత అగత్యం ఏమిటి? అంతా విచిత్రంగా ఉంది...అనుకుంటూ లేచికూర్చున్నాడు. కళ్ళను నులుముకున్నాడు.

వాస్తవం ప్రశాంతంగా ఉంది. సుజాత నిద్రపోతుంది. హమ్మయ్య! ఇదంతా కలన్నమాట. అనుకుని బల్లచెక్క కోసం ఇల్లు నలుమూలలూ వెతికాడు. మామూల్లే! బల్లచెక్క మామూలుగా మంచంకిందనే ఉంది. సుజాత నిద్రలో నవ్వుముఖంతో - "ఈ బల్లచెక్క పారెయ్య మనకండీ! సృష్టిలో పనికిరాని వస్తువంటూ ఏమీ లేదు. దీని అవసరం ఇవ్వాళో, రేపో మనకూ ఉంటుంది" మౌనంగా అంటున్నట్టుంది.

★

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులు కాదు. —సంపాదకుడు.